# పశ్చాత్తాపం



'ఆంధ్రభూమి' వారపత్రిక . . . 25 డిసెంబర్, 2003

"సార్... మేనేజర్‌గారు ఈవిడ విషయం మిమ్మల్ని చూడమన్నారు!"

- అటెండర్ చంద్రయ్య మాటలు విని తలెత్తి చూశాను. ఆమెకి దాదాపు ముప్ఫయ్ ఏళ్లుండవచ్చు. ముఖంలో దైన్యం, దుస్తుల గురించి పట్టించుకునే ఓపిక లేనట్లు నలిగిన దుస్తులతో ఉంది.

"కూర్చోండి..." అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపి, "చంద్రయ్యా... నాయర్‌ని రెండు కాఫీలు పంపమను!" అన్నాను అటెండర్‌తో.

ఆమె కూర్చుని, "వచ్చే గురువారం మా ఆయనకు గుండె ఆపరేషన్. ఆయన ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నారు. నేనూ అదే స్కూల్లో పనిచేస్తున్నాను. ఆపరేషన్ ఖర్చు భరించే ఆర్థికస్తోమత మాకు లేదు. అందుకే మా ప్రిన్సిపాల్ సలహా మేరకు ఇలా అన్ని ఆఫీసులకు వచ్చి సహాయం అర్థిస్తున్నాను. మీ మేనేజరుగారిని కలిశాను. ఆయన మీతో మాట్లాడమన్నారు" అంటూ తను తెచ్చిన ప్లాస్టిక్ ఫోల్డర్ నుండి డాక్టర్ రిపోర్ట్స్ తీసి చూపించబోయింది ఆమె.

నేను మా బ్రాంచి కల్చరల్ సెక్రటరీగా ఉన్నంతకాలం ఇటువంటి విషయాల్ని మా బ్రాంచి మేనేజరు నాకు అప్పజెప్పేవారు. నేను వచ్చినవాళ్ళ వివరాలు అడిగి, వాళ్ళు చెప్పింది నిజమని నిర్ధారించుకొని, తర్వాత సర్క్యులర్ ద్వారా తోటి ఉద్యోగులందరినీ తమకు తోచినంత ఇవ్వమని కోరడం, వసూలయిన మొత్తాన్ని ఆ సహాయం అడిగిన వారికి అందించడం జరుగుతుండేది. అయితే... ప్రస్తుతం మా బ్రాంచ్ కల్చరల్ సెక్రెటరీ రామ్మూర్తి. ఆ విషయమే ఆమెకి చెప్పి బ్రాంచి మేనేజర్ అలవాటు చొప్పున నా దగ్గరికి పంపించారని, నాతో వస్తే రామ్మూర్తికి పరిచయం చేస్తాననీ చెప్పాను.

"ఆయనతో మీరు కాస్త చెప్పండి!" అంది- దాదాపు ఏడుస్తూ.

"నేను చెబుతాను. మీరు ధైర్యంగా ఉండండి. మీవారికి నయమౌతుంది. ఆ భగవంతుణ్ణి నమ్ముకోండి. నమ్మినవాళ్ళను ఆయన తప్పకుండా కాపాడుతాడు" అన్నాను.

ఇంతలో... కాఫీలు రావడంతో ఇద్దరం త్రాగాము.

తర్వాత ఆమెని రామ్మూర్తికి పరిచయం చేసి అందరికీ వీలైనంత ఎక్కువ మొత్తం విరాళంగా ఇవ్వమంటూ సర్క్యులర్ తయారుచేయమని చెప్పి, నా సీటుకి వచ్చేశాను.

మరో గంటకు సర్క్యులర్‌తో అటెండర్ నా దగ్గరికి వచ్చాడు. రామ్మూర్తి పంపిన సర్క్యులర్ అది. గుండె ఆపరేషన్ ఎంతో ఖర్చుతో కూడుకున్నది కాబట్టి మానవతా దృక్పథంతో సహాయం చెయ్యమని రామ్మూర్తి రాసిపంపాడు.

నాకు ఒక విషయం గుర్తొచ్చి నవ్వొచ్చింది. నేను గతంలో పంపిన అనేక సర్క్యులర్‌లో రామ్మూర్తి ఎంతో కొంత మొత్తం రాసేవాడు. సర్క్యులర్ చూసినవాళ్ళకు అతనూ ఇచ్చాడని తెలియడానికి. అయితే డబ్బులు మాత్రం ఇచ్చేవాడు కాదు. అతని విషయం తెలియక మొదట్లో అతనికి రెండుసార్లు డబ్బు విషయం నేను గుర్తుచేశాను. అతను ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకున్నాడు. అప్పట్నుంచీ అతన్ని డబ్బులు అడగటం మానుకున్నాను. అతను పేరు రాయడం, డబ్బులు ఇవ్వకపోవడం అటెండర్లకూ అలవాటయిపోయింది. అతను రాసిన మొత్తం ఎదురుగా 'నాట్ పెయిడ్' అని రాసి, ఆ కాగితాన్ని ఫైల్ చేసుకోవడం నాకూ అలవాటయిపోయింది.

సర్క్యులర్‌లో రామ్మూర్తి పేరు కోసం వెతికాను. వంద రూపాయలు అతను ఇచ్చినట్లు రాసివుంది.

"'రామ్మూర్తి డబ్బులిచ్చాడా?" అని అటెండర్ని అడిగాను.

ఇచ్చాడని చెప్పాడు.

'దొంగ చేతికి తాళాలు ఇవ్వడం మంచిదే అన్నమాట!' అనుకొన్నాను. అతని ప్రవర్తనకి నాకు కోపం రావడానికి కారణం... రామ్మూర్తికి ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేకున్నా అతను అంత లోభిత్వం చూపించడమే. అతని భార్య బ్యాంకులో పనిచేస్తోంది. బాధ్యతలు, బాదరబందీలు లేవు.

ఇంతలో... నాకో ఆలోచన వచ్చింది. రామ్మూర్తి ప్రవర్తించినట్లే నేనూ ప్రవర్తించి అతనికి బుద్ధి చెప్పాలనుకున్నాను. లిస్టులో నా పేరు రాసి ఎదురుగా రెండు వందలు అంకెల్లో వేసి సంతకం పెట్టాను. డబ్బు తర్వాత ఇస్తానని చెప్పి అటెండర్‌ని పంపేశాను. ఆరోజు రెండుసార్లు రామ్మూర్తి నా సీటు దగ్గరికి వచ్చి డబ్బులు అడిగాడు. అతను చెప్పిన సాకులే నేనూ చెప్పాను. ఏం మాట్లాడకుండా వెళ్లిపోయాడు. మా ఆఫీసులో వందమందికి పైగా ఉద్యోగులు ఉండటంతో ఏడువేలకు పైగా వసూలయిందని, ఆ మొత్తాన్ని ఆమెకు ఆరోజు సాయంత్రమే అందజేశారని తెలిసింది.

ఒకరోజు ఆఫీసుకి రాగానే ఆమె కనిపించింది. నాకోసమే కాచుకొని ఉన్నట్లు నన్ను చూడగానే వడివడిగా సమీపించి "ఆపరేషన్ విజయవంతం అయింది. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను" అంటూ కన్నీళ్లతో రెండుచేతులూ జోడించింది.

నాకు సిగ్గేసింది. 'డబ్బులు సేకరించింది నేను కాదు... రామ్మూర్తి. పైగా నేను ఒక రూపాయి కూడా ఇవ్వలేదు. మామూలుగా ఇటువంటి సందర్భాలలో కనీసం వంద రూపాయలైనా ఇచ్చేవాణ్ణి. రామ్మూర్తికి బుద్ధి చెప్పాలని- అవసరంలో ఉన్న ఆమెకి ఆ డబ్బు అందివ్వకపోవడం ఎంతవరకు సమంజసం?'

"అన్ని ఆఫీసుల్లోకి మీ ఆఫీసులోనే ఎక్కువ మొత్తం వసూలయింది. మీరు నా బాధ ఓపికగా విని, రామ్మూర్తిగారితో చెప్పి ఈ సహాయం చేయించారు. ముఖ్యంగా నాకు ధైర్యం చెప్పారు. ఓ మంచివ్యక్తి నోటి నుంచి వచ్చే మంచిమాటలు నిజమవుతాయని నేను ఎక్కడో చదివాను. అది నిజమైంది ఈరోజు!" అంది ఆమె కృతజ్ఞతగా.

వెంటనే జేబులోంచి ఓ అయిదు వందల నోటు తీసి ఆమెకి ఇస్తూ- "ఉంచండి... మందులకు పనికొస్తుంది" అన్నాను. పంతానికి పోయి మానవత్వాన్ని మరిచానని నన్ను నిలదీస్తున్న నా అంతరాత్మకు సమాధానం చెప్పగలిగానన్న తృప్తి నాకు మిగిలింది.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

**జయంతి పబ్లికేషన్స్**

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన పూర్తి కేటలాగ్ కోసం మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.